ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 31 జనవరి 2025

మున్సిపల్ కమిషనర్ బదిలీ

రాయికల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ నిర్మల్‌కు బదిలీ అయ్యారు. రాయికల్ కమిషనర్‌గా నిర్మల్ కమిషనర్ కమ్రుద్దీన్ బదిలీ కాగా విధుల్లో చేరాల్సి ఉంది.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరామర్శ

రాయికల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాజీపేట గ్రామంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన నవీన్ కుటుంబసభ్యులను ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా నవీన్ పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.


'చలో సెక్రటేరియట్'ను విజయవంతం చేయాలి

మెట్‌పల్లి రూరల్, జనవరి, 30 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో వచ్చే నెల 5న తలపెట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పాల్గొని విజయవంతం చేయాలని మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు ఆకుల రాజారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని వేంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ధర్మపురి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ధర్మపురి మండలంలోని దొనూర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఏఎంసీ వైస్ చైర్మన్ సంగ నర్సింహులు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ముత్యం గంగారం, దాసరి పురుషోత్తం, నన్నెపు సురేందర్‌రాజు, పోడేటి తిరుపతి, లక్ష్మణ్, ఉపేందర్ పాల్గొన్నారు.

ధరణిలో సాంకేతిక సమస్యలతో ఇక్కట్లు..



- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- జిల్లాలో 1,125 దరఖాస్తులు పెండింగ్
- పరిష్కారం కాక రైతుల ఆందోళన

మొత్తం పెండింగ్ దరఖాస్తులు...1,125	
తహసీల్దార్ లాగిన్‌లో...	505
ఆర్డీవో లాగిన్‌లో...	307
అదనపు కలెక్టర్ లాగిన్‌లో	119
కలెక్టర్ లాగిన్‌లో	194

జగిత్యాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్‌లో పలు సాంకేతిక సమస్యలతో రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, ఇతర లావాదేవీలు ఆలస్యం అవుతున్నాయి. స్లాట్ బుక్ కావడంలో సైతం జాప్యం ఏర్పడుతోంది. డిజిటల్లీ నాట్ సైన్డ్, సర్వే నంబరు సరిగా లేదని అంటూ వివిధ కారణాలు చూపుతూ సర్వర్ మొరాయిస్తోంది. ధరణి పోర్టల్ టెర్రాసిస్ నుంచి నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ చేతుల్లోకి వెళ్లినా తిప్పలు తప్పడం లేదు. జిల్లాలో మ్యుటేషన్, నాలా, జీపీఏ, పీవోబీ, కోర్టు కేసులు, పాస్ బుక్ డేటా కరెక్షన్ తదితర దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి పరిష్కారం కోసం ధరణి పోర్టల్ మాడ్యూల్స్‌లో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ పరిష్కారం కావడం లేదు. దీంతో బాధితులు తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఖాతా, సర్వే నంబర్లు మిస్సింగ్, తప్పులు, పట్టాదారు పేర్లు, ఫొటోల్లో తప్పులు, విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు, పట్టా, అసైన్డ్ భూములు ప్రభుత్వ భూములుగా నమోదు వంటి తప్పులు పరిష్కారం కావడం లేదని దరఖాస్తుదారులు అంటున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ భూములకు డిమాండ్ వచ్చింది. ఈ క్రమంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తమ భూ సమస్యలు కొలిక్కి రాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మీ సేవలో ఫీజులు చెల్లించి దరఖాస్తు చేసుకున్నా రెవెన్యూ అధికారులు సరైన ధ్రువీకరణ పత్రాలు లేనివి రిజెక్ట్ చేస్తున్నారు. ఈ విషయమై ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో సంప్రదించగా అధికారుల నుంచి సరైన సమాధానమే ఉండడం లేదని రైతులు వాపోతున్నారు.

● నెలల తరబడి కార్యాలయాల్లోనే..

ధరణి పోర్టల్‌ను గత ప్రభుత్వం 2020 అక్టోబర్ 2న అమల్లోకి వచ్చింది. భూ సమస్యలు పారదర్శకంగా పరిష్కరించేందుకు జీఎల్ఎం పేరిట వెసులుబాటు కల్పించింది. రైతులు మీసేవ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే నేరుగా కలెక్టర్ లాగిన్‌కు వెళ్తుంది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆయా తహసీల్దార్లకు కలెక్టర్ చేరవేస్తారు. నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చిన నాలుగు రోజుల్లోనే పరిష్కరించాలి. అభ్యంతరాలు ఉంటే వాటిని నమోదు చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు ఏ దశలో ఉందనే విషయాన్ని సంబంధిత దరఖాస్తుదారుడికి తెలపాల్సి ఉంటుంది. కానీ ఈ నెల 25వ తేదీ నాటికి జిల్లా వ్యాప్తంగా 1,125 ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు తమ భూ సమస్యలను ధరణి వెబ్‌సైట్ ద్వారా కలెక్టర్లకు విన్నవించేందుకు వెబ్‌సైట్ జీఎల్ఎం, టీం-33 మాడ్యుల్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ ఆప్షన్ల ద్వారా వేల మంది రైతులు తమ భూ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలించి సర్వే నంబర్‌పై మోఖా పంచనామా నిర్వహించి తుది నివేదికను కలెక్టర్ కార్యాలయానికి పంపుతున్నారు. అక్కడకు చేరిన నివేదికలను వేగంగా.,

-మిగతా 8లో..

మహాత్మాగాంధీ ఆశయ సాధనకు కృషి

-కలెక్టర్ సత్య ప్రసాద్



బాపూజీకి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, అధికారులు

జగిత్యాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఘన నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్త విశ్వానికి శాంతి సందేశం ఇచ్చిన నేత మహాత్మాగాంధీ అని కొనియాడారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బీఎస్ లత, గౌతమ్‌రెడ్డి, డీఆర్‌డీఓ రఘువరన్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదగాలి

-కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



గురుకుల పాఠశాలలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి రూరల్, జనవరి, 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గురువారం మెట్‌పల్లి మండలంలోని మేడిపల్లి గ్రామ శివారులోని మైనార్టీ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించారు. గురుకులం, తరగతి గదులు, పరిసరాలు పరిశీలించారు. గురుకులంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులంలో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. పిల్లలకు మెరుగైన చదువుతో పాటు ఆరోగ్యాన్ని అందిస్తే వారు జీవితంలో గురువులను జీవితంతా గుర్తుంచుకుంటారన్నారు. ప్రతి ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈయన వెంటా నాయకులు, తదితరులు ఉన్నారు.

సాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

● ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



కాలువను పరిశీలిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని నాన్ ఆయకట్టు గ్రామమైన నందగిరి గ్రామానికి సాగునీటి సమస్య గూర్చి ఇటీవల రైతులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు గురువారం కాళేశ్వరం లింక్ 2 కాలువను, బూరుగుపల్లి శివారులోని వరద కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా వరద కాలువకు తూము నిర్మాణం, లింక్ 2 కాలువ ద్వారా నందగిరి చెరువులు నింపేందుకు గల తూముల నిర్మాణం చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించే రైతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఎన్ని నిధులైనా వెచ్చించి ఈ ప్రాంత రైతులకు నీటి ఇబ్బందులు రాకుండా కృషి చేస్తానన్నారు. ఇటీవల గోదావరిలో నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే వెంటనే సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఒక టీఎంసీ నీటిని విడుదల చేయించానన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఒరుగల శ్రీనివాస్, పార్టీ అధ్యక్షులు బుర్ర రాములు గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ కర్ర భాస్కర్‌రెడ్డి, నాయకులు గాజుల గంగా మల్లేశం, సత్యనారాయణ రెడ్డి, అశోక్ రెడ్డి, మల్లారెడ్డి, తిరుపతి, విష్ణు, రవినాయక్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి

మల్లాపూర్, జనవరి, 30 (ఆంధ్రజ్యోతి) : గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ క్షమాపణలు చెప్పాలని మాల మహానీయుల సంఘం అధ్యక్షుడు తూర్పు రాజన్న డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని నడుకుడా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతం మత్తులో ఉండే వారికి మానవతా భావజాలం గురించి ఎలా అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు తలారి వినీత్, రాము, రాజేశ్వర్, రాజుకుమార్, ప్రశాంత్, ప్రసాద్, మోహన్, రాజేశ్వర్, లడ్డు, నరేష్ పాల్గొన్నారు.

బీడీ పరిశ్రమలపై జీఎస్టీ రద్దు చేయాలి
● ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు 8

అంజన్న హుండీ ఆదాయం రూ1.15కోట్లు 7

కాంగ్రెస్ ఎన్నికల హామీలను నెరవేర్చాలి

● కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ● జిల్లావ్యాప్తంగా గాంధీజీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేత



మెట్‌పల్లిలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని గురువారం గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలు చేయని అసమర్థ ప్రభుత్వం కళ్లు తెరవాలని తెలిపారు.

● జగిత్యాల అగ్రికల్చర్: కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యిందని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ విమర్శించారు. గురువారం జిల్లా కేంద్రంలోని స్థానిక మంచినీళ్ల బావి చౌరస్తా వద్ద గల మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శీలం ప్రియాంక ప్రవీణ్, ఆనందరావు, వొల్లెం మల్లేశం, తుమ్మ గంగాధర్, గంగారెడ్డి, వెంకటేశ్వర్లు, నక్క గంగాధర్, నాడెం శంకర్, రిజ్వాన్, దేవేందర్‌నాయక్, బుర్ర ప్రవీణ్, రాజన్న తదితరులున్నారు.

● ధర్మపురి: రైతుల జీవితాల్లో చీకట్లు నింపిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి కోరారు. ధర్మపురి పట్టణంలో మహాత్మాగాంధీ విగ్రహానికి గురువారం వినతి పత్రాన్ని సమర్పించారు కార్యక్రమంలో ధర్మపురి ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఆకుల రాజేష్, మాజీ అధ్యక్షులు స్తంభంకాడి శ్యాంసుందర్, మాజీ కౌన్సిలర్లు బండారి అశోక్, అయ్యోరి వేణుగోపాల్, సంగి శేఖర్, చిలువేరి శ్యాంసుందర్ పాల్గొన్నారు.

● పెగడపల్లి: మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, నాయకులు ఉప్పుగండ్ల నరేందర్ రెడ్డి, నేరెల్ల గంగాధర్, ఉప్పులంచ లక్ష్మణ్, తిర్మని నర్సింహా రెడ్డి పాల్గొన్నారు.

● మల్యాల: మల్యాలలో గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. మండల శాఖ అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, బద్దం తిరుపతిరెడ్డి, గడ్డం రాజేశం, అజరుద్దీన్, సురేశ్, అనిల్‌రెడ్డి, దేవరాజం, కొంక నర్సయ్య, చిన్నదుర్గయ్య పాల్గొన్నారు

● వెల్గటూర్: మోస పూరిత వాగ్దానాలతో అధికారం లోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యం లోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను వంచిస్తోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంచంద్రం గౌడ్ దుయ్యబట్టారు. గురువారం వెల్గటూర్ అంబేద్కర్ చౌక్ వద్ద మహాత్మాగాంధీ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి జూపాక కుమార్, సింహాచలం జగన్, లింగయ్య, పత్తిపాక వెంకటేష్, మూగల సత్యం పాల్గొన్నారు.

● రాయికల్: రాయికల్ పట్టణంలోని మహాత్మ గాంధీ విగ్రహానికి పట్టణ బీఆర్ఎస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండల, పట్టణ అధ్యక్షులు బర్కం మల్లేష్, ఎలిగేటి అనిల్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎలగందుల ఉదయశ్రీ, మండల ప్రధాన కార్యదర్శి రత్నాకర్ రావు, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు స్పందనసాగర్ రావు పాల్గొన్నారు.

● కొడిమ్యాల: మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నేతలు వినతి పత్రాన్ని అందించారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, కొత్తూరి స్వామి, వేణు, మల్లయ్య, శరత్, శంకు, శంకరయ్య ఉన్నారు.

● గొల్లపల్లి : రాఘవ పట్నం గ్రామంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షులు గోస్కుల జలేందర్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శంకరయ్య, మాజీ వైస్ ఎంపీపీ సత్తయ్య పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ పోస్టులకు ఇంటర్వ్యూలు

బీర్‌పూర్,జనవరి 30(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని కస్తూర్బా పాఠశాలలో ఆరు నాన్ టీచింగ్ పోస్టులకు గురువారం ఎంఈవో నాగభూషణం, తహసీల్దార్ ముజిబుద్దిన్, ఎంపీడీవో లచ్చాలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 85 దరఖాస్తులు రాగా ఇంటర్వ్యూలకు 60 మంది హాజరయ్యారు. అభ్యర్థుల యొక్క సర్టిఫికెట్లు పరిశీలించి డీఈవో కార్యాలయానికి పంపించినట్లు ఎంఈవో నాగభూషణం తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ పరిశీలకులు శ్రీనివాస్, రాహుల్, సీఆర్‌పీలు రవి, వెంకట్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

జగిత్యాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రంలోనే జిల్లాను ముందు వరుసలో నిలపాలని ఇంటర్ విద్య జిల్లా అధికారి బొప్పరాతి నారాయణ అన్నారు. గురువారం పట్టణంలోని ఇంటర్ విద్యాశాఖ కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశం పొందిన ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొట్టాల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి అత్తినేని శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కాశవేణి శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షురాలు జి రచన, నాయకులు శ్రీహరి, రమేశ్, శ్రీకాంత్, భాస్కర్, సుమన్, నర్సింగం, మహేశ్ పాల్గొన్నారు.

భూఆక్రమణలపై ఆర్డీవో విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో మధుసూధన్

జగిత్యాలరూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో భూకబ్జాపై అధికారులు విచారణ చేపట్టారు. కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశం మేరకు గురువారం జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్ భూములను పరిశీలించారు. సర్వేనంబర్ 437 లో హద్దులు గుర్తించారు. ఎవరెవరు ఏ మేరకు ఆక్రమణలో ఉన్నారనే విషయమై ఆరా తీశారు. కార్యాలయంలో పాత రికార్డులను పరిశీలించి ఎవరెవరికి ఏవిధంగా భూమి దక్కిందో గుర్తించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ సర్వేను వేగవంతం చేయాలని, మరికొన్ని టీం లను పెంచి వేగవంతంగా సర్వేను పూర్తి చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్ ను ఆదేశించారు. ప్రస్తుతం డాక్యుమెంట్ వెరిఫికేషన్ చేస్తున్నామని, పూర్తి స్థాయి విచారణ జరిపి భూములను స్వాధీనపర్చుకుంటామని తెలిపారు. ఆర్ఐ భూమయ్య, తదితరులు ఉన్నారు.

'శిశు మరణాలను తగ్గించాలి'



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి ప్రమోద్

జగిత్యాల అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): శిశు మరణాలను తగ్గించాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్ వైద్యశాఖ సిబ్బందికి సూచించారు. ప్రతి బాలింతకు శిశువుల రక్షణ పట్ల కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆయన అన్నారు. గురువారం శిశు మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 104 చిన్న పిల్లల మరణాలపై ఆడిట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సూచ నలు చేశారు. పిల్లలకు పాలిచ్చిన తర్వాత వారిని భుజంపై వేసుకోవాలన్నారు. త్రేన్పులు వచ్చిన తర్వాతనే పడుకోబెట్టాలని, పిల్లలకు స్నానం చేయించేప్పుడు నోట్లోకి నీరు పోకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త, గృహ సందర్శన సమయంలో బాలింతలను కౌన్సెలింగ్ చేస్తే శిశు మరణాలను తగ్గించ వచ్చని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో వైద్యశాఖ అధికారులు డాక్టర్ శ్రీనివాస్, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి, సపరింటెండెంట్ సుమన్, తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు'

మల్లాపూర్, జనవరి, 30 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నాయకులు పోలీసులను దబాయించి బీఆర్ఎస్ నాయకులపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆరోపించారు. గురువారం మల్లాపూర్ మండలానికి చెందిన బండి లింగస్వామిగౌడ్, యుద్దం శరత్‌గౌడ్, మ్యాకల సతీష్, బైరి రవికుమార్‌యాదవ్‌లను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ హయంలో మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పార్టీలకు అతీతంగా నాయకులతో స్నేహపూర్వకంగా ఉంటూ అందరికీ అండగా నిలిచారన్నారు. నియోజక వర్గంలో కక్షపూరితంతో స్వార్థం కోసం కార్యకర్తల మధ్య చిచ్చు పెట్టడం సరియైన పద్ధతి కాదన్నారు. బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన కేసులన్నీ బేషరతుగా వెంటనే ఉపసంహరించుకోవాలని హితవు పలికారు. ఇలాంటి అక్రమ కేసులు పెట్టుంకు ఇబ్బందులకు గురి చేస్తు పోరాడుతూనే ఉంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మాకు ఉద్యమాలు కొత్త కాదని, ప్రజాల పక్షాన నిలబడి హక్కుల కోసం ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. నియోజక వర్గంలో ఐదు సార్లు ఓటమి పాలైన కాంగ్రెస్ పార్టీ నాయకులు అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కొడుకుపై గొడ్డలితో తండ్రి దాడి

జమ్మికుంట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని గణేష్‌నగర్‌లో కొడుకుపై తండ్రి గొడ్డలితో దాడిచేసి గాయపరిచాడు. వివరాల్లోకి వెళితే.. గణేష్‌నగర్‌కు చెందిన అర్కల మల్లయ్య-బుచ్చమ్మ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. చిన్న కుమారుడు లోకేష్ పట్టణంలోని ఓ మొబైల్‌షాపులో పనిచేస్తున్నాడు. అతడు మద్యానికి బానిసై వృద్ధుడైన తండ్రి మల్లయ్యను తరుచూ కొడుతూ ఉండేవాడు. అడిగినప్పుడు డబ్బులు ఇవ్వకుంటే చంపుతానని బెదిరింపులకు గురిచేశాడు. దీంతో భయాందోళనకు గురైన తండ్రి మల్లయ్య తన కొడుకు బతికి ఉంటే తనను బతకనివ్వడని భావించాడు. ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. తెల్లవారు జామున 3గంటల సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న కొడుకు తలపై గొడ్డలితో వేటువేశాడు. తీవ్రగాయాలపాలై ప్రాణపాయ స్థితిలో ఉన్న లోకేష్‌ను కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు లోకేష్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

పంచాయతీ కార్యాలయంలో అగ్నిప్రమాదం

జమ్మికుంట రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో అగ్ని ప్రమాదం జరిగింది. పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న పాత రిక్షాకు మొదట నిప్పంటుకోగా మంటలు పంచాయతీ కార్యాలయానికి వ్యాపించాయి. ఈప్రమాదంలో రికార్డులు దగ్ధం అయ్యాయని కార్యదర్శి మూగల అంజిరెడ్డి గురువారం పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

జమ్మికుంట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని 16వ వార్డుకు చెందిన కావ్య గురువారం అదృశ్యం అయింది. కావ్య హన్మకొండలోని ఓ డిగ్రీకళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతోంది. సంకాంత్రి పండుగకు సెలవుల నిమిత్తం స్వగ్రామం జమ్మికుంటకు వచ్చింది. గురువారం ఉదయం 10గంటల సమయంలో షాపునకువెళ్లి వస్తానని ఇంట్లోచెప్పి బయటకు వెళ్లింది. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకుండా పోయింది. తల్లిరమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలోని ఓ ఇంటిలో చోరీ కేసులో అదే గ్రామానికి చెందిన అక్కపల్లి సంజీవ్, పెద్దోళ్ల మనోజ్‌లను గురువారం అరెస్ట్ చేశామని ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.4వేల నగదును స్వాధీనపర్చుకున్నామన్నారు. ఎస్‌ఐ రమాకాంత్ కథనం ప్రకారం.. గ్రామంలోని వంగాల లక్ష్మారెడ్డి తండ్రి మోహన్‌రెడ్డి ఈనెల 24న అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి తన ఇంటికి తాళం వేసి గ్రామంలోని ఓ గదిని అద్దెకు తీసుకుని కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. ఈనెల 27న రాత్రి తాళం వేసి ఉన్న ఇంటిలో గుర్తుతెలియన వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రూ.10వేల నగదును తస్కరించారని పేర్కొంటూ ఈ నెల 28న బాధితుడు లక్ష్మారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదే గ్రామంలోని సంజీవ్, మనోజ్‌లపై అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించారు. జల్సాలకు అలవాటుపడిన నిందితులు చోరీకి పాల్పడింది తామేనని అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.4వేల నగదును స్వాధీనపర్చుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

వేములవాడ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ కల్లు కంపౌండు వద్ద గురువారం ఒంటినిండా గాట్లతో అనుమానాస్పదంగా ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రాంగనర్‌కు చెందిన సారుగు రఘు(32) అనే యువకుడు వంట మాస్టర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య అమూల్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సంవత్సరం క్రితం రఘుకు భార్యతో గొడవలు కావడంతో ఆమె తల్లిగారి ఊరు సిద్దిపేట మండలం జక్కాపూర్ గ్రామంలో ఉంటోంది. గురువారం ఉదయం 11గంటల వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ కల్లు కాంపౌండువద్ద ఒంటిమీద గాట్లతో రఘు మృతదేహం అనుమానాస్పదంగా కనబడటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతికిగల కారణాలను ఆరాతీశారు. విషయం తెలుసుకున్న అమూల్య కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ ఏరియా ఆసుపత్రికి వచ్చి మృతుడిని గుర్తించింది. తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని అమూల్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

అక్రమ కట్టడం కూల్చివేత

రామడుగు,జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలోని పల్లెప్రకృతి వనంలో అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జీపీ సిబ్బంది కూల్చి వేశారు. రాత్రికి రాత్రే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నిర్మాణం చేపట్టగా గ్రామస్థుల ఫిర్యాదు మేరకు స్పందించిన కార్యదర్శి పోలీసుల బందోబస్తు మధ్య అక్రమ కట్టడాన్ని కూల్చివేశారు. ప్రభుత్వం స్థలం ఆక్రమించి నిర్మాణం చేపట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న షాపు యజమానులకు జరిమానా

ధర్మపురి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో గురువారం మున్సి పల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది పలు షాపులను తనిఖీ చేసి ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న యజమానులకు జరిమానా విధించారు. తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్యాల గంగాధర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజ నీరు మహేష్, వార్డు ఆఫీసర్ వెంకటేష్ పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరికి జైలు

వేములవాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పోలీసు విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఇద్దరు వ్యక్తులకు ఆరు మాసాల కారాగార జైలు శిక్ష, వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి గురువారం తీర్పు వెల్లడించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ పట్టణానికి చెందిన రొండే శంకరయ్య, గుర్రం అశోక్ తనవిధులకు ఆటంకం కలిగించినట్లు ఎస్సై చిట్టిబాబు అక్టోబరు 2017లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ అనంతరం విచారణ అధికారి శ్రీనివాస్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా, కోర్టు కానిస్టేబుల్ సురేష్‌కోర్టులో సాక్ష్యం ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరపున విక్రాంత్ కేసును వాదించగా, పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఇద్దరికి ఆరు మాసాల జైలుశిక్షతోపాటు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా కూడా విధించినట్లు సీఐ ప్రకటనలో పేర్కొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, జనవరి30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాసులపల్లి గ్రామానికిచెందిన కడారిఐలయ్య(68) అనేవృద్ధుడు జీవితంపై విరక్తిచెంది బావిలో దూకి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం మృతుడు ఐలయ్య క్యాన్సర్‌వ్యాధితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయం కాకపోవడంతో జీవతంపై విరక్తిచెంది బావిలోపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడిభార్య రాయమల్లమ్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సాంప్రదాయ సాగును వదిలి..

- వ్యవసాయంలో నూతన ఒరవడి..
- అధిక ఆదాయం పొందుతున్న మంగళపల్లి, మల్కపేట రైతులు

కోనరావుపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు వ్యవసాయం అంటే వరి సాగు అనే పరిస్థితి ఉండేది. పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ పద్ధతులు మార్చుకుంటున్నారు. వరిని వదిలిపెట్టి కూరగాయలు, పూలు, మొక్కజొన్న.. ఇలా వేర్వేరు రకాల పంటలను సాగు చేస్తున్నారు. మండలానికి చెందిన పలువురు రైతులు పంటల మార్పిడి చేస్తూ అధిక ఆదాయం పొందుతున్నారు.

కోనరావుపేట మండలం మంగళపల్లిలో ఉప్పుల మల్లయ్య, రొక్కం కావ్య-శ్రీకాంత్‌రెడ్డి దంపతులు వ్యవసాయంలో కూరగా యలు, మొక్కజొన్న, వరి, పత్తి సాగు చేస్తూ అధిక దిగుబడి సాధిస్తున్నారు. మల్కాపేటకు చెందిన తీపిరి ప్రభాకర్‌తో పాటు ఇతర గ్రామాల రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించారు. తమకు ఉన్న కొద్దిపాటి భూముల్లో పలు రకాల పంటలు పండిస్తూ ఎక్కువ దిగుబడులు సాధిస్తున్నారు. సీజన్‌కు అనుకూలంగా కూరగాయలు, మొక్క జొన్న సాగు చేస్తున్నారు. పచ్చి కంకులను అమ్మడం వల్ల ఎకరాకు 80 వేల రూపాయల ఆదాయం పొందారు. ఎండిన కంకులు విక్రయిస్తే తక్కువ ఆదాయం వచ్చేదని రైతులు చెబుతున్నారు. దీనివల్ల రైతులకు ఆదాయం పెరిగిందని, పంటల మార్పిడి చేయడం వల్ల భూసారం పెరిగి, పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు వస్తున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మల్కాపేటలో సాగు చేస్తున్న మొక్కజొన్న



మంగళపల్లిలో చిక్కుడుకాయను సేకరిస్తున్న కూలీలు

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

- రొక్కం కావ్యశ్రీకాంత్‌రెడ్డి, మహిళా రైతు



నేను పీజీ చేశాను. ఉద్యోగాలకు వెళ్లకుండా వ్యవసాయంపైనే దృష్టి సారించాను. వ్యవసాయంలో పాత పద్ధతిలో కాకుండా మెలకువలు పాటిస్తూ కూరగాయలు, మొక్కజొన్న, పత్తి, మిర్చి పండిస్తూ అధిక దిగుబడి సాధిస్తున్నాం. ఉద్యోగాలకు వెళ్లకుండా నా భర్త శ్రీకాంత్‌రెడ్డితో కలిసి వ్యవసాయం చేస్తూ మంచి లాభాలు సాధిస్తున్నాం.

నూతన పద్ధతులు పాటించాలి..

- సందీప్, వ్యవసాయ అధికారి, కోనరావుపేట



వ్యవసాయంలో రైతులు నూతన పద్ధతులు పాటించాలి. పంటల మార్పిడి ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. మండల రైతులు మెలకులు పాటించే విధంగా అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే పలు గ్రామాల రైతులు అధికారుల సూచనలు పాటిస్తూ దిగుబడి సాధిస్తున్నారు. ఇంకా రైతుల్లో మార్పు రావడానికి ప్రయత్నం చేస్తాం.

బూట్లతో ఆలయంలోకి వెళ్లేందుకు యత్నించిన వ్యక్తి

- మతిస్థిమితం సరిగా లేదని గుర్తింపు..

వేములవాడ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన ఓవ్యక్తి వేములవాడ మండలం అగ్రహారం హనుమాన్ ఆలయంలోకి బూట్లు ధరించి వెళ్లేందుకు యత్నించాడు. దీంతో గమనించిన ఆలయ అర్చకులు, సిబ్బంది ఆయను అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో సదరు వ్యక్తి అర్చకులతో వాగ్వాదానికి దిగాడు. ఆలయ సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు విచారణ చేసిన పోలీసులు కరీంనగర్‌కు చెందిన ఖాజా మొయినుద్దీన్‌గా గుర్తించారు. ఈ మేరకు సదరు వ్యక్తి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించి హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ మానసిక వైద్య ఆసుపత్రికి పంపించినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

తగిన పరిహారం ఇస్తేనే భూములు ఇస్తాం

- ఎకరానికి రూ.45నుంచి 50లక్షలు ఇవ్వాలని రైతుల డిమాండ్



భూసేకరణ డిప్యూటీ కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న నవాబుపేట రైతులు

చిగురుమామిడి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వరదకాలువ నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు ఎకరానికి రూ.45నుంచి 50 లక్షలవరకు పరిహారం ఇవ్వాలని నవాబుపేట రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన గ్రామసభలో ఈ విషయాన్ని పేర్కొంటూసభ నుంచి వెళ్లిపోయారు. మండలంలోని నవాబుపేట గ్రామంలో వరదకాలువ నిర్మాణానికి భూసేకరణ కోసం గ్రామంలోని రైతువేదికలో అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామంలో 67మంది రైతులకు సంబంధించిన 42ఎకరాలపై చిలుకు భూములు కాలువ నిర్మాణంలో పోతు న్నట్లు అధికారులు సర్వేలో తేల్చారు. సంబంధిత రైతులకు సమాచారం ఇవ్వడానికి గ్రామంలో భూసేకరణ డిప్యూటీ కలెక్టరు కిరణ్‌ప్రకాశ్ అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సమావేశానికి రైతులు పెద్దఎత్తున వచ్చారు. అధికారులు భూములు కోల్పోతున్న రైతుల జాబితాను చదివి వినిపించడానికి ప్రయత్నం చేయగా రైతులు అభ్యంతరం తెలిపారు. మాకు ఎలాంటి సమావేశాలు వద్దని, ఎకరానికి రూ.45నుంచి 50లక్షల వరకు పరిహారం అందిస్తేనే భూములు ఇస్తామని డిమాండ్ చేశారు. మాకు న్యాయం జరిగితేనే భూములు ఇస్తాం, లేదంటే ఇచ్చేది లేదని అధికారులకు తేల్చి చెప్పి సమావేశం బహిష్కరించి వెళ్లిపోయారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

ధర్మపురి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నం చేసిన ధర్మపురి మండలం రాజారం గ్రామానికి చెందిన సునార్‌కాని సందీప్ అనే తొమ్మిదో తరగతి విద్యార్థి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. బాగా చదువుకోవాలని, స్నేహితులతో తిరగవద్దని తండ్రి మందలించడంతో ఈనెల18న సందీప్ ఇంటిలో గడ్డి మందు తాగినట్లు ఎస్‌ఐ తెలిపారు. సందీ ప్‌ను మెరుగైన వైద్యచికిత్సకోసం కరీంనగ ర్‌లోని ఒకప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పిం చారు. చికిత్స పొందుతూ సందీప్ గురు వారం మృతిచెందాడు. తండ్రి సునార్‌కాని మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

కరీంనగర్ క్రైం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసిన కరీంనగర్‌రూరల్ మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన మేకల కవిత(24) గురువారం మృతి చెందిందని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. ఈ నెల 28న పురుగుల మందు తాగిన మేకలకవితను కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

చొప్పదండి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్లాపూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు ప్రమాదవ శాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడి గాయపడ్డాడు. గుమ్లాపూర్ గ్రామానికి చెందిన పెరుమాండ్ల శ్రీనివాస్(40) గీత కార్మిక వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం కల్లుతీసేందుకు తాటిచెట్టు ఎక్కిన శ్రీనివాస్ అకస్మాత్తుగా పైనుంచి జారికిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ శ్రీనివాస్‌ను కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

మల్లాపూర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అప్పులబాధతో బుధవారం పురుగుల మందుతాగిన మండలంలోని సిర్పూర్ గ్రామానికి చెందిన మహ్మద్ ఖలీల్(36) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రాజుకుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలప్రకారం మహ్మద్ ఖలీల్ పాషా నాలుగేండ్లుగా గల్ఫ్ దేశాలకు వెళ్లి వస్తున్నాడు. అక్కడ సరియైన పనిలేక స్వగ్రామం వచ్చితిరిగి మళ్లీఅప్పుచేసి దుబాయ్ వెళ్లాడు. అయిన పనిసరిగా లేదని ఇంటికి వచ్చాడు. చేసిన అప్పులు ఎలాతీ ర్చాలని మనస్థాపానికి గురై బుధవారం సిర్పూర్ గ్రామశివారులోని ఎల్లమ్మగుడి దగ్గర మందుతాగి కుటుంబసభ్యులకు ఫోన్‌ద్వారా తెలిపాడు. కుటుంబసభ్యులు ఖలీల్‌ను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. భార్య రేష్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అండర్‌గ్రౌండ్ కేబుల్ పనులు అభినందనీయం

- టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



అండర్ గ్రౌండ్ కేబుల్ కాంపాక్ట్‌ట్రాన్స్ఫార్మర్ పనులను పరిశీలిస్తున్న సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

గణేశ్‌నగర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోనే మొట్టమొదటగా అండర్ గ్రౌండ్ కేబుల్ పనులు అభినందనీయమని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. స్మార్ట్‌సిటీ వర్క్స్‌లో భాగంగా టవర్ సర్కిల్ గంజ్ ఏరియాలో చేపట్టిన పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందిని అభినందించారు. డిస్కమ్‌లో కరీంనగర్ జిల్లా, కరీంనగర్ టౌన్ డివిజన్, టౌన్ -1 సబ్ డివిజన్, టౌన్ -5 సెక్షన్స్ అవార్డులు తీసుకున్నందుకు మేక రమేష్, డీఈ జంపాల రాజం, ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్, ఏఈ-టౌన్-5, నజియజాబీన్‌లను అభినందించారు.

చిన్నారి ధృవన్ సురక్షితం?

- మమత మిస్టరీ కేసులో పోలీసుల పురోగతి

కరీంనగర్ క్రైం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలో అదృశ్యమైన తల్లీకొడుకుల కేసులో తల్లి అనుమానాస్పదంగా మృతి చెందగా కొడుకు సురక్షితంగా ఉన్నట్లు సమాచారం. వారం రోజులక్రితం మంచిర్యాలలో అదృశ్యమైన తల్లీకొడుకులలో తల్లి మమత గంగాధర మండలం కురిక్యాల వరద కాలువ సమీపంలో మృతదేహం లభ్యమైంది. ఆమె నాలుగేళ్ల కొడుకు ధృవన్ ఆచూకీ తెలియకపోవటంతో గంగాధర, చొప్పదండి పోలీసులు నాలుగు రోజులుగా సీసీ కెమెరాలు, ఫోన్‌కాల్స్ జల్లెడ పడుతుండగా కేసుకు సంబంధించిన కీలకమైన సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. చిన్నారి ధృవన్ సేఫ్‌గా ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. నిందితులను ఇంకా పోలీసులు అదుపులోకి తీసుకోలేదని తెలిసింది. నిందితుల ఉపయోగించిన కారు యజమానిని గుర్తిం చినప్పటికీ ఆ కారును కొందరికి కిరాయికి ఇచ్చినట్లుగా యజమాని చెబుతున్నట్లు సమాచారం. కేసులో నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు టీంలు నిర్విరామంగా పనిచేస్తున్నాయి. ఇప్పటికే కొన్ని పోలీసు టీంలు హైదరాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు వెళ్లి కొంత సమాచారం సేకరించినట్లు తెలిసింది. మమత హత్య కేసుకు సంబంధించి నిందితులను శుక్రవారం వరకు అరెస్టు చేసే అవకాశముందని తెలుస్తోంది. మమతను తెలిసిన వారే వెంట తీసుకువెళ్లి ఘటనకు పాల్పడినట్లుగా సమాచారం.

రోడ్డు పనుల అడ్డగింత

ఎల్లారెడ్డిపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామపంచాయతీ పరిధిలోని రామిండ్ల వాడ నుంచి అక్కపల్లి వరకు నిర్మిస్తున్న రహదారి పనుల్లో భాగంగా తమ వ్యవసాయ భూమిలో నుంచి పనులు చేస్తున్నారని పేర్కొంటూ బాధితులు గురువారం అడ్డుకున్నారు. జేసీబీ వాహనాన్ని నిలిపివేసి నిరసనకు దిగారు. గ్రామ శివారులో చేపడుతున్న రహదారికి రెండు వైపులా స్థలాన్ని కేటాయించకుండా తమ భూమిలో నుంచే నిర్మాణ పనులు చేస్తున్నారని బాధితులు రామిండ్ల దేవలక్ష్మీ పేర్కొన్నారు. ముందుగా ఇరు పక్కల ఉన్న రైతుల భూముల్లో నుంచి కొలతలు వేసిన సంబంధిత శాఖ అధికారులు తిరిగి తమ భూమిలో నుంచి పనులు చేపట్టి తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. తమకు న్యాయం జరిగే వరకు పనులను ముందుకు సాగనీయబోమని తేల్చిచెప్పారు. ఈ విషయంపై తహసీల్దార్ రామచంద్రంను వివరణ కోరగా రహదారి నిర్మాణంలో ఎవరికీ అన్యాయం జరుగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించేందుకు పాటు పడుతామని తహసీల్దార్ రామచంద్రం వివరించారు.

పోలీస్ బెటాలియన్ సందర్శన

సిరిసిల్ల రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లఅర్బన్ పరిధిలోని సర్దాపూర్17వ బెటాలియన్‌ను పోలీస్ హౌసింగ్‌కార్పొరేషన్ ఎండీ రమేష్ (ఐజీపీ) గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించారు. వెంట ఎస్పీ అఖిల్‌మహాజన్, బెటాలియన్ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువ కానిస్టేబుల్ దుర్మరణం

- గర్జనపల్లిలో విషాదం



మృతదేహానికి నివాళులర్పిస్తున్న అసిస్టెంట్ కమాండెంట్ సత్యనారాయణ

వీర్నపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన యువకానిస్టేబుల్ మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకివెళితే.. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం సీతారాం నాయక్ తండా గ్రామానికి చెందిన అజ్మీర కళ్యాణ్ (30) నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి 7వ బెటాలియన్‌లో 2018 బ్యాచ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలతో కళ్యాణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. యువకానిస్టేబుల్ మృతితో స్వగ్రామంసీతారాం నాయక్ తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. గురువారం మృతదేహం స్వగ్రామం చేరడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, పోలీసులు పెద్దఎత్తున తరలి వచ్చారు. అదే గ్రామానికి చెందిన సీఐడీ ఎస్పీ భుక్య రాంరెడ్డితోపాటు 7వబెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్‌లు సత్యనారాయణ, శరత్, ఆర్ఐ నరేష్, ఆర్ఎస్‌ఐలు తిరుపతి, వేణు, సుమారు వంద మంది 2018 బ్యాచ్ కానిస్టేబుళ్లు పాల్గొని మృతుడికి నివాళులర్పించారు. మృతునికి భార్య సుష్మ, కుమార్తె అభియుక్త(3), కుమారుడు అభిషేక్ (4 నెలలు) ఉన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

జమ్మికుంట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం నాగంపేట గ్రామపంచాయతీ కార్యదర్శి ఇల్లందుల శ్రీనివాస్ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డాడని అదే గ్రామానికి చెందిన కట్కోజుల శ్రీనివాస్ ఆచారి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. గురువారం నాగంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో జిల్లా గ్రామపంచాయతీ అధికారి పాత శ్రీనివాస్, ఇంచార్జ్ ఎంపీడీవో వెంకటేశ్వర్లు నిధుల దుర్వినీయోగంపై విచారణ చేపట్టారు. అప్పటి రికార్డులు, ఇతర రశీదులు క్షుణ్ణంగా పరిశీలించారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని జిల్లా పంచాయతీశాఖ అధికారి తెలిపారు. అనంతరం ఫిర్యాదు దారుడు శ్రీనివాస్ ఆచారి మాట్లాడుతూ నిధుల దుర్వినియోగానికి సంబంధించిన వివరాలు ఇవ్వాలని ఆర్టీఐ ద్వారా కోరినప్పటికీ సదరు కార్యదర్శి జాప్యం చేశాడన్నారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కార్యదర్శి ఇల్లందుల శ్రీనివాస్ ప్రస్తుతం ఇల్లందకుంట కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గత నవంబర్‌లో నిర్వహించిన బీఈడీ రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్ వి శ్రీరంగ ప్రసాద్ విడుదల చేశారు. విద్యార్థులు పరీక్షల ఫలితాలను శాతవాహన వెబ్‌సైట్ www.satavahana.ac.in చూసుకోవచ్చని తెలిపారు.

వెలిచాల గ్రామాన్ని సందర్శించిన యూనిసెఫ్ బృందం

రామడుగు,జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచాల గ్రామాన్ని గురువారం యూనిసెఫ్ బృందం సందర్శించింది.ఈ సందర్భంగా గ్రామంలోని మిషన్ భగీరథ తాగునీటి సరఫరాను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన విటమిన్ గార్డెన్‌ను, పాఠశాల విద్యార్థులు అవలంభిస్తున్న హ్యాండ్‌వాష్ పద్ధతిని గమనించారు. వారి వెంట అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయి, యూనిసెఫ్ ప్రతినిధులు వెంకటేష్, ప్రభాత్, ఫణీంద్ర, డీఆర్డీవో శ్రీధర్, డిడబ్ల్యూవో సబిత, తదితరులు ఉన్నారు.

మహాశివరాత్రి జాతరకు ఏర్పాట్లు



గుడిచెరువులోని పార్కింగ్ స్థలాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

వేములవాడ కల్చరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి జాతరకు రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు. మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని లక్షల్లో భక్తులు రానున్న నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం ఆలయ పార్కింగ్ స్థలాన్ని చదును చేయించారు. ప్రతిసంవత్సరం మూడు రోజులపాటు నిర్వహించే జాతరకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని, నిత్యం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని, ఇప్పటికే ఆలయగోపురాలు, గోడలకు పెయింటింగ్, సీసీ కెమరాలు, స్మార్ట్ టీవీలు, గ్రాగునీరు. లైటింగ్ సిస్టం, క్యూలైన్‌లో భక్తుల సౌకర్యార్థం ఫ్యాన్‌లను ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు.

అంజన్న హుండీ ఆదాయం రూ1.15కోట్లు



హుండీ డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

మల్యాల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానానికి హుండీలద్వారా రూ.1,15,93,291నగదు ఆదాయం సమకూరినట్లు ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. 70రోజులకు ఆలయంలోని 12హుండీలను విప్పి గురువారం లెక్కింపు చేయగా నగదుతో పాటు 55గ్రాముల మిశ్రమబంగారం, 3కిలోల మిశ్రమ వెండి, 61విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవోతెలిపారు. లెక్కింపులో కరీంనగర్ ఏసీ సుప్రియ, ఏఈవో వైఅంజయ్య, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్ పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఉద్యోగుల డిమాండ్లను అంగీకరించాలి

● ఢిల్లీలో ఎన్‌బీసీ సమావేశంలో గుర్తింపు సంఘం డిమాండ్



సమావేశంలో పాల్గొన్న గుర్తింపు సంఘాల నాయకులు

జ్యోతినగర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ఉద్యోగుల డిమాండ్లను సత్వరమే యాజమాన్యం అంగీకరిచాలని ఎన్‌బీసీ సభ్యుడు, గుర్తింపు కార్మికసంఘం ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బాబర్ సలీం పాషా, నాయకులు డిమాండ్ చేశారు. ఢిల్లీలో గురువారం నిర్వహించిన జాతీయ ద్వైపాక్షిక సంఘం(ఎన్‌బీసీ) సమావేశంలో ఐఎన్‌టీయూసీ తరుపున 22డిమాండ్లను లేవనెత్తారు. ఎన్టీపీసీని స్థాపించి50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎన్టీపీసీ ఉద్యోగులకు ఐదు లక్షల రూపాయల నగదు లేదా 50గ్రాముల బంగారాన్ని బహుమతిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్ల్యు 10కేటగిరి ఉదోగులకు ఇ2(ఎగ్జిక్యూటివ్) పదోన్నతి కల్పించాలన్నారు. పదోన్నతిపొందిన ఉద్యోగులకు వారు పనిచేస్తున్న రీజియన్‌పరిధిలోని ప్రాంతాలకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. బీటెక్‌పూర్తిచేసిన ఉదోగులకు సమానస్థాయి పోస్టులను కల్పించాలని, డిప్లొమాట్రైనీలకు శిక్షణాకాలాన్ని ఏడాదికేపరిమితం చేయాలన్నారు. అధికారులకు ఇస్తున్న విధంగానే మూడేళ్లకు ఒకసారి ల్యాప్‌టాప్ రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని చెల్లించాలని కోరారు. ఎన్‌బీసీ సమావేశంలో రామగుండం ఎన్టీపీసీ గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి రాజేశ్వర్, అధ్యక్షుడు కృష్ణయ్య, ఇతర ప్రాజెక్టుల గుర్తింపు సంఘం నాయకులు, ఎన్టీపీసీ హెచ్‌ఆర్ అధికారులు పాల్గొన్నారు.

షెడ్యూల్ విడుదలతో రాజకీయ వేడి

● అభ్యర్థుల ఖరారుపై పార్టీల దృష్టి
● ఒకటి, రెండు రోజుల్లో ప్రకటించనున్న ఏఐసీసీ
● పార్టీ నేతల మొగ్గు అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి వైపే..
● బీఆర్ఎస్ అభ్యర్థిగా సర్దార్ రవీందర్‌సింగ్?

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)



కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల కావడంతో రాజకీయ సందడి మొదలైంది. అభ్యర్థుల ఖరారుపై పార్టీ దృష్టి పెట్టాయి. ఈ మేరకు కసరత్తులు ప్రారంభించాయి. గురువారం మీడియాతో మాట్లాడిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి పోటీ చేయరని, అభ్యర్థి ఎవరన్నది ఒకటి రెండు రోజుల్లో ప్రకటిస్తామని వెల్లడించారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి వైపు పార్టీ నేతలు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. నేడో, రేపో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి అధికారికంగా అభ్యర్థిని ప్రకటించే అవకాశ మున్నదని సమాచారం. టీపీసీసీ నుంచి ఈ స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేరునే పంపించారు. జీవన్‌రెడ్డి తాను పోటీలో ఉండబోనని ఏఐసీసీకి తెలిపారు. నరేందర్‌రెడ్డి మొదట జీవన్‌రెడ్డి వద్దకు వెళ్లి ఆయన పోటీ చేసే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి పోటీకి పెద్దగా ఆసక్తి చూపించలేదని ప్రచారం జరిగింది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల గురించి టీపీసీసీలో సమావేశం జరిగిన సందర్భంలో తన రాజకీయ భవిష్యత్ గురించి జీవన్‌రెడ్డి ప్రశ్నించడంతో ఆయన తిరిగి పోటీలో ఉంటారేమోనని భావించారు. గురువారం శ్రీధర్‌బాబు ప్రకటనతో ఆయన పోటీ చేయరని స్పష్టత వచ్చింది. కాగ్రెస్ అధిష్టానం ఇప్పటికే అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, ప్రసన్న హరికృష్ణ పేర్లను పరిశీలించి క్షేత్ర స్థాయిలో సమాచారాన్ని సేకరించారు. ఈ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే 42 అసెంబ్లీ స్థానాల్లో పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, పార్టీ ఎంపీల అభిప్రాయాలు తెలుసుకొని నరేందర్‌రెడ్డి పేరును ఖరారు చేయాలనికి నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గంలో ఇప్పటి వరకు 3.47 లక్షల ఓట్లు నమోదు కాగా అందులో సగం మ్మడి జిల్లాకు చెందినవే ఉన్నాయి. దీంతో ఈ జిల్లా వాసినే అభ్యర్థిగా నిలిపితే గెలుపు సాధించవచ్చని పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. నరేందర్‌రెడ్డి అందరి కంటే ఎక్కువ ఓట్లు నమోదు చేయించుకున్నారు. ఈ అంశం ఆయనకు కలిసి వచ్చే అవకాశం ఉంది.

బీఆర్ఎస్ అభ్యర్థిగా సర్దార్ రవీందర్‌సింగ్?

కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ మేయర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్‌ను నిలపాలని ఆ పార్టీ అధినేత కేసీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అభ్యర్థి పేరు వెల్లడి కాగానే తమ అభ్యర్థిని ప్రకటించాలని బీఆర్ఎస్ నాయకత్వం భావిస్తోందని తెలిసింది. రవీందర్‌సింగ్ అభ్యర్థిత్వంపై కేటీఆర్, హరీష్‌రావు, కవిత సుముఖంగా ఉన్నారని సమాచారం. అభ్యర్థిని నిలిపితే ఉద్యమకారుడు అయిన రవీందర్‌సింగ్‌కే అవకాశం కల్పించాలని కేసీఆర్‌కు సూచించినట్లు సమాచారం. కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఇదే తన అభిప్రాయంగా కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లారని తెలిసింది. ఈ రోజు లేదా రేపటికి రవీందర్‌సింగ్ పేరును పార్టీ ప్రకటించే అవకాశ ముందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.



బీసీ రిజర్వేషన్‌పై తీర్పురాగానే స్థానిక ఎన్నికలకు వెళతాం

● మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో కోర్టులో ఉన్న స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్‌పై తీర్పు రాగానే ఎన్నికలకు వెళుతామని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆయన కొండా సత్యలక్ష్మి గార్డెన్స్‌లో కార్యక్రమం ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల తీర్పు వచ్చా ఎన్నికలకు వెళ్లి తప్పక విజయం సాధిస్తామన్నారు. బీసీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో బీసీల రిజర్వేషన్ ప్రక్రియ గురించిన అంశం కోర్టు పరిధిలో ఉందని, సానుకూలమైన తీర్పు వస్తుంద న్నారు. తీర్పును అనుసరించి విధివిధా నాలు ఉంటాయన్నారు. వాటి ప్రకారం ప్రభుత్వం స్థానికసంస్థల్లో రిజర్వేషన్ కల్పిస్తుందన్నారు. ఎన్నికలకు భయపడే ప్రభుత్వం మాది కాదు... ప్రజల మద్దతు ఉన్న ప్రజాప్రభుత్వం మాది అని పేర్కొన్నారు. ప్రతిపక్షాలకు విలువ ఇవ్వని గత ప్రభుత్వాలకు మాట్లాడే అర్హత లేదన్నారు.

నిజాం షుగర్ ఫాక్టరీని పునరుద్ధరిస్తాం

● ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కరీంనగర్ అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నిజాం షుగర్ ఫ్యాక్టరీని 2025డిసెంబర్‌లోగా పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. గురువారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలులో భాగంగా నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునురుద్ధరణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. ఫ్యాక్టరీకి సంబంధించి 100కోట్ల అప్పు కూడా చెల్లించామని తెలిపారు. స్థానిక రైతులను చెరుకు పంటకు సిద్ధం చేయాల్సిన అవసరముందని, ఈదిశగా త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. నిజాం చెరుకు ఫాక్టరీ పునరుద్ధరణకు అవసరమైతే కేంద్రసహాయం కూడా కోరుతామన్నారు. కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిని కాంగ్రెస్‌పార్టీ రెండు రోజుల్లో ప్రకటిస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ వంద శాతం కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేయనని ఏఐసీసీకి చెప్పారన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల కోసం నాలుగు జిల్లాల నుంచి చాలామంది ఆశావహుల నుంచి దరఖాస్తులు వచ్చాయని, వీటిని ఏఐసీసీ పరిశీలించి అర్హులను ప్రకటిస్తుందన్నారు. రాబోయే 3సంవత్సరాల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తామన్నారు. హైదరాబాద్ నగరానికి ధీటుగా ద్వితీయ, తృతీయశ్రేణి నగరాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.

దావోస్‌లో పారిశ్రామికవేత్తలకు హైదరాబాద్ ప్రత్యేకత గురించి వివరించామన్నారు. చిన్న, మధ్య, సూక్ష్మ తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయాలని రాష్ట్రంలో ఏడాది కిందట ఎంఎస్‌ఎంఇ(మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) పాలసీని తీసుకువచ్చామన్నారు. దేశంలోనే తెలంగాణ ఎంఎస్‌ఎంఇ మెరుగైన పాలసీగా పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహిళలకు రుణాలు అందించి. వారితో పరిశ్రమలను ఏర్పాటు చేయించి.. ఉత్పత్తి, మార్కెటింగ్‌ల ద్వారా మహిళలు, మహిళా సంఘాలను పటిష్టం చేసే చర్యలు తీసుకున్నామన్నారు. దావోస్ ఒప్పందంలో సాఫ్ట్‌వేర్ రంగాలలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అమెరికా కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పెద్ద ఎత్తున 500బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టిందని ప్రెసిడెంట్ ట్రంప్ ప్రకటించారన్నారు. పారిశ్రామికవేత్తల నుంచి పెట్టుబడులు తీసుకువచ్చి రాష్ట్రంలోని నిరుద్యోగు యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా దావోస్ ఒప్పందాలు చేసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. గత సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం దావోస్‌లో 18 పారిశ్రామిక పెట్టుబడుల ఒప్పందాలు చేసుకోగా ఇందులో 10ఒప్పందాలతో 50శాతం వరకు పనులు పూర్తయ్యాయని, మరో ఎనిమిది ప్రగతిలో ఉన్నట్లు మంత్రి తెలిపారు. పారిశ్రామిక, ఐటీరంగాలలో తెలంగాణ మొదటిస్థానంలో ఉండాలనే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పద్మ అవార్డుల ఎంపిక కోసం తెలంగాణ అనేకమంది, వివిధ రంగాలలో నిష్ణాతులు ఉన్నారని.. కేంద్రప్రభుత్వం గుర్తించాలని మంత్రి కోరారు. సమావేశంలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే ఆరెపల్లిమోహన్, కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్‌జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి, ఒగ్గుదామోదర్, కొరివి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు



వాలీబాల్ పోటీ

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 30 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు హోరాహోరీగా సాగుతున్నాయి. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదా నంలో నిర్వహిస్తున్న ఈ క్రీడలను మూ డోరోజు గురువారం ఐజీ స్పోర్ట్స్ రమేష్ రెడ్డి, కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. క్రీడలతో క్రమశిక్షణ, క్రీడా స్పూర్తి అలవడుతుందన్నారు. క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా ముందుకు సాగా లన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ వసుంధర యాదవ్, డీఎస్పీ విజయ్ కుమార్, ఆర్‌యు కుమారస్వామి పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన జూడో, యోగా, బాడీ బిల్డింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మల్టీ జోన్‌వన్ ఐజీఎస్ చంద్రశేఖర్ రెడ్డి పతకాలను ప్రదానం చేశారు.

● నేడు క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు...

మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోలీస్ రాష్ట్ర స్థాయి క్రీడలు చివరి దశకు చేరాయి. ఖో-ఖో పోటీల్లో క్వార్టర్ ఫైనల్‌కు పోటీలు చేరాయి. కబడ్డీ, బాస్కెట్‌బాల్ క్రీడాంశాల్లో పోటీలు సెమీ ఫైనల్స్‌కు చేరాయి. వాలీబాల్, హాకీ పోటీలు క్వార్టర్స్ ఫైనల్‌కు చేరాయి. శుక్రవారం అన్ని క్రీడాంశాల్లో క్వార్టర్ ఫైనల్స్ సెమీ ఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు.

శనివారం రాష్ట్రస్థాయి పోటీల ముగింపు ఉత్సవాన్ని నిర్వహించనున్నారు.



పోలీస్ జట్ల మధ్య టగ్‌ఆఫ్ వార్



దేహదారుఢ్య పోటీల్లో పోలీస్ క్రీడాకారులు

కల సాకారమవుతున్న వేళ

● గోదావరినదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి అటవీశాఖ అనుమతి
● డిసెంబరులో శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
● అనుమతుల కోసం మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక కృషి

మంథని, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మంథని పట్టణ శివారులోని గోదావరి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఎట్టకేలకు కేంద్ర అటవీశాఖ కండిషనల్ క్లియరెన్స్ ఇచ్చింది. పెద్దపల్లి-మంచిర్యాల జిల్లాలను కలుపుతూ మంథని-శివ్వారం మధ్య ఉన్న గోదావరి నదిపై భారీ వంతెన నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. దాదాపు రూ. 125 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ బ్రిడ్జికి సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా డిసెంబరు 4న శంస్థాపన చేశారు.

దాదాపు ఏడాది క్రితమే రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి మంథనిలో గోదావరి నదిపై భారీ వంతెనను నిర్మించి మంచి ర్యాల-పెద్దపల్లి జిల్లాల ప్రజలకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తామని ప్రకటించారు.గోదావరినదిలో ఎల్. మడుగు వన్యప్రాణుల-మొసళ్ల సంరక్షణ కేంద్రం ఉండటంతో బ్రిడ్జి నిర్మాణానికి ఫారెస్టు క్లియరెన్స్ రావడంపై కొంత సందిగ్ధత ఏర్పడింది. అప్పటి నుంచి వంతెన నిర్మాణానికి రూ. 125 కోట్ల నిధులు మంజూరు, అటవీశాఖ అనుమతి కోసం ప్రత్యేక శ్రద్ధతో కృషి చేయడంతో చివరకు ఫారెస్టు క్లియరెన్సర్స్ సైతం వచ్చింది. పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డితో ఢిల్లీ టూర్‌లో సైతం మంత్రి శ్రీధర్‌బాబు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రిని కలిసి ఫారెస్టు క్లియర్స్ కోసం వినతిపత్రాన్ని ఇచ్చారు. ఆ తర్వాత గోదావరినదిపై వంతెన నిర్మాణంపై వేగవంతంగా కదలికలు వచ్చాయి. ఈ క్రమంలో కేంద్ర అటవీశాఖ ద్వారా షరతులతో కూడిన అనుమతులు లభించాయి.


ముచ్చటగా మూడు బ్రిడ్జిలు..

గోదావరి నదిపై ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మంథని మండలంలోని సిరిపురం వద్ద సుందిళ్ల బ్యారేజీ కం బ్రిడ్జిని నిర్మించారు. మహారాష్ట్ర నుంచి వరంగల్-విజయవాడకు నూతనంగా నిర్మిస్తున్న నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా మండలంలోని విలోచవరం గ్రామ శివారులోని గోదావరి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం జరగనుంది. మంథని మండలంలోని కన్నాల, పందులపల్లి, పుట్టపాక గ్రామ శివారుల్లో ఇప్పటకే హైవే పనులు ప్రారంభమయ్యాయి. హైవే బ్రిడ్జితో నదిపై రెండో వంతెన నిర్మాణం కానుంది. పట్టణ శివారులోని తాజాగా అటవీశాఖ అనుమతితో గోదావరినదిపై ముచ్చటగా మూడో భారీ వంతెన నిర్మాణం కానుంది.

రెండు జిల్లాలు, రాష్ట్రాలకు రవాణా సౌకర్యం

గోదావరినదిపై అందుబాటులోకి రానున్న మూడు బ్రిడ్జిలతో పెద్దపల్లి,మంచిర్యాల జిల్లాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు పెద్దపల్లి జిల్లాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. మంథని నియోజకవర్గానికి సరిహద్దుగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు, మంచిర్యాల జిల్లాలకు వెళ్లాలంటే గోదావరినది అడ్డుగా ఉండేది. గోదావరిఖని, కాళేశ్వరం వద్ద మాత్రమే గోదావరినది దాటడానికి బ్రిడ్జిలు అందుబాటులో ఉండగా ఇటీవల సుందిళ్ల వద్ద బ్రిడ్జి అందుబాటులోకి వచ్చింది. తాజాగా మంథని- శివ్వారం మధ్య గోదావరి నదిపై వంతెన, నేషనల్ గ్రీన్‌పీల్డు హైవేలో భాగంగా విలోచవరం-గోపాల్‌పూర్ గ్రామాల మధ్య మరో వంతెన నిర్మాణం కానుంది. ఈ రెండు వంతెనలతో మొత్తం మూడు వంతెనల ద్వారా మరో ఏడాదిలో మంచిర్యాల జిల్లాకు, జైపూర్, చెన్నూర్ మీదుగా మహారాష్ట్ర, అక్కడి నుంచి చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లడానికి పెద్దపల్లి జిల్లా ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగు పడనుంది.

మొసళ్ల సంచారానికి ఇబ్బందులు కలగకుండా..



గోదావరినదిలో మొసలి సంచారం (ఫైల్)

గోదావరినదిలో వన్యప్రాణి మొసళ్ల సంరక్షణ కేంద్రం ఉండటంతో వంతెన నిర్మా ణానికి కేంద్ర అటవీ శాఖ షరతులతో కూడిన అను మతులను ఇచ్చారు. బ్రిడ్జి నిర్మాణం అయ్యే స్థలంలో ఎలాంటి ఫారెస్టు భూమి లేకపోవడంతో వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని దృష్టిలో ఉంచుకొని నదిలో ఉండే మొసళ్ల సంచారానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే నిర్మాణ పను లు చేపట్టాలని అటవీశాఖ నిబంధనలు విధించింది. వాటిని అతిక్రమిస్తే వన్యప్రాణి చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని వెల్లడించారు.

వ్యాపార-వాణిజ్య వర్గాలకు ఊరట..

జిల్లా విభజన తర్వాత నియోజకవర్గ కేంద్రమైన మంథనిలో వ్యాపార-వాణిజ్య వర్గాలకు గిరాకీలు పడిపోయాయి. మంథని డివిజన్ (నియోజకవర్గం)లోని ఐదు మండలాలు భూపాలపల్లి జిల్లాలో పరిపాలన పరంగా కలపడంతో ప్రజలు వివిధ పనుల నిమిత్తం మంథనికి రావడం తగ్గిపోయింది. నదిపై వంతెన నిర్మాణం పూర్తి అయితే గోదావరినది అవతలి వైపు ఉన్న జైపూర్ మండలంలోని పలు గ్రామాలు మంథనికి అతి చేరువగా ఉండటంతో పాటు అంతర్ జిల్లాలు, అంతర్ రాష్ట్రాల ప్రజల రవాణా కారణంగా తమ వ్యాపారాలు పుంజుకునే అవకాశం ఉంది.



గోదావరి నది

జాతీయ సమైక్యత శిబిరానికి గురుకుల విద్యార్థిని



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ మాలతి

కరీంనగర్ రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి11 నుంచి 17వరకు బెంగుళూరులో నిర్వహించనున్న జాతీయ సమైఖ్యతా శిబిరానికి కరీంనగర్ మండలం నగునూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థిని జి పుష్పలత ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ టి మాలతి తెలిపారు. కళాశాల జాతీయ సేవా పథకం వలంటీర్ డిగ్రీ బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న పుష్పలత జాతీయ సమైఖ్యతా శిబిరానికి ఎంపిక కావడం పట్ల కళాశాల అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్ పద్మజ, ఎర్రోజు వెంకటేశ్వర్లు, టి సురేష్‌కుమార్, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ కె గీతారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయికి..

● పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించిన క్రీడాకారులు
● రాష్ట్ర స్థాయి క్రీడల్లో సత్తా చాటుతున్న సూర్యాపేట జిల్లా వేంపటి కబడ్డీ ప్లేయర్స్

కరీంనగర్ స్పోర్ట్స్ జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వారందరూ గ్రామీణ క్రీడాకారులు.. అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరుచుకున్నారు. కుటుంబ సభ్యుల అండ, కోచ్‌ల శిక్షణతో కబడ్డీలో జాతీయస్థాయికి ఎదిగారు. పోలీస్ శాఖలో ఉద్యోగులుగా చేరారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వేంపటి గ్రామానికి చెందిన ఐదుగురు కబడ్డీ క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. వీరు యాదాద్రి జోన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న వీరుతమ జట్టు విజయంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

● చిన్ననాటి నుంచి ఆసక్తి..

- గుండగాని శ్రావణి, ఎస్ఐ, హైదరాబాద్ సిటీ



కబడ్డీలో చిన్ననాటి నుంచి ఆసక్తి ఉంది. కోచ్‌ల సహకారంతో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగాను. పలు జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించాను. ఫలితంగా స్పోర్ట్స్ కోటాలో ఎస్ఐగా ఉద్యోగం వచ్చింది. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాను.

● జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి

- కె సుధీర్, హెడ్ కానిస్టేబుల్



ఎలాంటి క్రీడానేపథ్యంలేని కుటుంబం మాది. తోటి క్రీడాకారులు కబడ్డీ ఆడుతుండడం చూసి కబడ్డీ నేర్చుకున్నాను. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. పోలీస్ ఉద్యోగం సంపాదించాను. యాదాద్రి జోన్‌కబడ్డీజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాను. పోలీస్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు కృషి చేస్తాను.

● జట్టు విజయంలో కీలకపాత్ర...

- కొమురెల్లి, కానిస్టేబుల్, హైదరాబాద్



పలు రాష్ట్ర, జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నాను. సూర్యాపేట నుంచి మేము జాతీయ క్రీడాకారులుగా ఎదిగాం. రాష్ట్రస్థాయి పోలీస్‌క్రీడల్లో మాజట్టు విజయంలో కీలకపాత్ర పోషిస్తున్నాం.

● రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహించడం అభినందనీయం...

- ఆకుల నవీన్, పోలీస్ హెడ్‌కానిస్టేబుల్, సూర్యాపేట



కరీంనగర్ జిల్లా కేంద్రంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మూడవ తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు నిర్వహించడం అభినందనీయం. చాలా సంవత్సరాల తర్వాత పోలీస్ క్రీడలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర పోటీల్లో ప్రతిభచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యేందుకు కృషి చేస్తాం.

కల్యాణ వేదికకు భూమి పూజ

రాయికల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శివాలయం ఆవరణలో గురువారం శివ సేవకుల ఆధ్వర్యంలో శివ పార్వతుల కల్యాణ వేదిక, సహస్ర దీపాలంకరణ మండప నిర్మాణాలకు భూమిపూజ చేశారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివ సేవకులు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అల్పాహార సామగ్రి అందజేత

రాయికల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైతాపూర్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన గంగుల శ్రీనివాస్-సారికలు వివాహ వార్షికోత్సవం సందర్భంగా అల్పాహారం సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ముక్కాల మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు గిరిధర్, గంగరాజం, గంగుల సహృదయ్ ఫౌండేషన్ అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, శివనీతి రమేష్, బూస రమేష్, మాద నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

భీమారం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలంలోని పలు పాఠశాలల మరమ్మతుల కోసం ఎస్‌డీఎఫ్ నిధులు రూ.9 లక్షల 50 వేలను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంజూరు చేశారు. రాజలింగంపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాల మరమ్మతుకు రూ.3 లక్షల 50 వేలు, రత్నాలపల్లె పాఠశాలకు రూ.4 లక్షల 50 వేలు, మన్నెగూడెం అంగన్‌వాడీ సెంటర్ మరమ్మతులకు రూ.లక్షా 50 వేలు మంజూరు చేశారు.

●కథలాపూర్: పాఠశాలల్లో అభివృద్ధి పనుల కోసం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎస్‌డీఎఫ్ గ్రాంటు రూ.5.40 లక్షలు మంజూరు చేశారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం తెలిపారు. మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలల్లో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు రు. 2.40 లక్షలు, మోడల్ స్కూల్‌లో ఆర్‌ఓ ప్లాంట్‌కు 2 లక్షలు, కస్తూర్బాలో బాల్కనీ మరమ్మతులకు లక్ష రూపాలయ చొప్పున మంజూరు చేశారని తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

మెట్‌పల్లి రూరల్, జనవరి, 30 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న తాటికొండ శివలాల్‌ను వారు నాయకులతో కలిసి శాలువతో సన్మానించి ప్రశంస పత్రం అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ సేవలతోనే గుర్తింపు ఉంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శి అశోక్‌గౌడ్, కారోబార్ భూమచారి, సిబ్బంది, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీకి ఘన నివాళి

కోరుట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మహత్మ గాంధీ వర్ధంతి వేడుకలను గురువారం పట్టణంలోని జువ్వాడి భవనంలో ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లను అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు మాట్లాడారు. దేశం స్వాతంత్ర సాదించండో గాంధీ పాత్ర గోప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుమల గంగాధర్, కొంతం రాజం, నహీం, కిష్టాగౌడ్, లక్ష్మీనారాయణ, మేకల నర్సయ్య, నేమూరి భూమయ్య, పసుల కృష్ణ ప్రసాద్, అయిండ్ల గణేష్, న్యమతాబాదు రాకేష్, తునికి సాయి పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి టౌన్:** పట్టణంలో గురువారం గాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై సాయికృష్ణ టాకీస్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, ఖాదీలో ఆర్యవైశ్య సంఘం నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి రూరల్:** మండలంలోని ఆయా గ్రామాల్లో మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. గురువారం మండలంలోని వేంపేట గ్రామంలోని జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లి శేఖర్‌గౌడ్, పుల్ల చంద్రశేఖర్‌గౌడ్, పుల్ల శేఖర్‌గౌడ్, బద్దం స్వామిరెడ్డి, కల్లెడ గంగాధర్, ఎల్లల బాపురెడ్డి, ధర్మరాజు, పురుషోత్తం, రాజు, చిట్యాల రాజేందర్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.




కోరుట్ల, మెట్‌పల్లిలో గాంధీకి నివాళులర్పిస్తున్న నాయకులు

జగిత్యాల అర్బన్: ప్రజలందరు మహాత్ముని బాటలో నడిచి హింస లేని సమాజాన్ని నిర్మించాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ అన్నారు. గురువారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటీజన్స్ నాయకులు గౌరిశెట్టి విశ్వనాథం, వెల్ముల ప్రకాశ్ రావు. హన్మంత రెడ్డి, డాక్టర్ రాజగోపాలాచారి తదితరులు పాల్గొన్నారు.

●**ధర్మపురి:** ధర్మపురి పట్టణంలోని హరిత హోటల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు దేశ స్వాంతంత్రం కోసం ఆయన చేసిన త్యాగాలను గుర్తు చేశారు దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి దామెర రాంసుందాకర్‌రావు, బీజేపీ ధర్మపురి పట్టణ అధ్యక్షులు గాజు బాస్కర్, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, అసెంబ్లీ కో కన్వీనర్ బండారు లక్ష్మణ్, ఓబీసీ జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, పట్టణ మాజీ అధ్యక్షులు బెజ్జారపు లవణ్, తిరుమన్‌దాసు సత్యనారాయణ, దివిటి శ్రీధర్, సూరజ్, అనిల్, నవీన్, మధుసూదన్ పాల్గొన్నారు.

●**మల్లాపూర్:** మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం పలువురు నాయకులు, యువకులు పార్టీలకతీతంగా మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సందర్భంగా విగ్రహంను శుభ్రపరిచి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●**మల్యాల:** మహాత్మగాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోనియాగుడి వద్ద నిర్వహించి ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శనిగారపు తిరుపతి, రాజేశ్వర్‌రెడ్డి, మ్యాక లక్ష్మన్, ప్రసాద్, అనిల్, హరినాథ్, ఇమామ్, పృథ్వీరాజ్, అనిల్ పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

-రూ. 1.20లక్షల ఆస్తి నష్టం

మెట్‌పల్లి రూరల్, జనవరి, 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. గురువారం గ్రామానికి చెందిన అలవాల లహరి భర్త దుబాయ్‌లో ఉండగా ఇద్దరి పిల్లలను స్కూల్ పంపించినంతరం ఇంట్లో పూజ చేసినంతరం తాళం వేసి తోట పనులకు వెళ్లింది. కొంత సమయానికి ఇంట్లోని నంచి దట్టమైన పొగలు రావడంతో ఆమెకు ఇంటి చుట్టున్న వారు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఇంటికి వచ్చి తాళం తీసి చూసేసరికి షార్ట్‌సర్క్యూట్‌తో నిప్పంటుకోని ఇంట్లోని సామాన్లు, వస్తువులు, దుస్తువులు కాలుతున్నట్లు గుర్తించింది. గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి, నీటితో మంటలను చల్లార్చారు. అనంతరం మెట్‌పల్లి నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా ఆర్పివేశారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో సుమారు రూ. 1.20లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని లహరి తెలిపింది. ప్రమాదానికి గురైనా ఇల్లును రెవెన్యూ ఆర్‌ఐ ఉమేష్ పరిశీలించి ప్రమాదానికి గల వివరాలను సేకరించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

కుష్ఠు వ్యాధి నియంత్రణకు చర్యలు



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు

జగిత్యాల అర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి అన్నారు. జాతీయ కుష్ఠు నివారణ దినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారితో పాటు సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాస్, డాక్టర్ జైపాల్ రెడ్డి, తదితరులు ప్రతిజ్ఞ చేసిన వారిలో ఉన్నారు.

●బీర్‌పూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో కుష్ఠువ్యాధిపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని డిప్యూటి డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. గురువారం బీర్‌పూర్ మండలకేంద్రంలోని పల్లె దవాఖానలో కుష్ఠువ్యాధి స్పర్శపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కుష్ఠు రోగులకు శ్రద్దతో వివక్ష చూపకుండా సేవలు చేస్తామని తదితర అంశాలపై హెల్త్ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రాధ, సీహెచ్‌వో కుద్దుష్, హెల్త్ సూపర్‌వైజర్ కిషోర్ పవార్, హెచ్‌పీ తారా, హెచ్.ఎల్.హెచ్.పీ శిరీష, ప్రభుకిరణ్, ఏఎన్‌ఎంలు కళావతి, లక్ష్మి, దీవెన, శారధ, కవిత పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

జగిత్యాల అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణం శంకులపల్లి గ్రామానికి చెందిన నీలి తిరుపతి ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్ళి అనారోగ్యంతో మరణించగా మృతదేహం గురువారం జగిత్యాలలోని మృతుని ఇంటికి చేరుకుంది. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మృతుని ఇంటికి వెళ్ళి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విశ్వకర్మలకు పనిముట్లు పంపిణీ

రాయికల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని విశ్వకర్మలకు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం లబ్ధిదారులకు గురువారం బీజేపీ ఆధ్వర్యంలో రాయికల్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ సహకారంతో పనిముట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాయికల్ పట్టణ అధ్యక్షుడు ధర్మపురి, సబ్ పోస్ట్ మాస్టర్ రాజు, పోస్ట్‌మ్యాన్ మధు, ఉమామహేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీల మంజూరు

భీమారం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధ పడుతూ చికిత్స అవసరం ఉన్న పలువురికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం ఎల్‌వోసీలను మంజూరు చేయించారు. ఈ సందర్భంగా మండలంలోని కమ్మరిపేట గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మికి రూ.2 లక్షల 50 వేలు, గోవిందారంకు చెందిన పి.వెంకటేష్‌కు రూ.లక్షా 75 వేలు విలువ చేసే ఎల్‌వోసీలు మంజూరు నాయకులు అందజేశారు.

ధరణిలో సాంకేతిక సమస్యలతో ఇక్కట్లు

5వపేజీ తరువాయి

పరిశీలించి డిజిటల్ సంతకాలు చేయాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యం మూలంగా రైతుల దరఖాస్తులు నెలల తరబడి కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి.

●భూమాతపై ఆశలు

ధరణి పోర్టల్‌లోని నిబంధనలతో రైతులు సమస్యల పరిష్కారానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన రేవంత్‌రెడ్డి సర్కార్ భూమాత పోర్టల్ తేవాలని యోచిస్తోంది. దీనికి సంబంధించిన నిబంధనలు ఇంకా ఖరారు కానప్పటికీ ఆయా మండలాల్లోని తహసీల్దార్లు మాత్రం త్వరలో భూమాత వస్తుందని, మీ సమస్యలు త్వరగా పరిష్కారం అయ్యే అవకాశం ఉందని చెబుతూ కార్యాలయాలకు వచ్చే రైతులను తిరిగి పంపిస్తున్నారు. భూ సమస్యలు పరిష్కారం కాక, పట్టదారు, పాసుపుస్తకాలు రాక రైతులు బ్యాంకు రుణాలు, రైతు బంధు, ఇతర ప్రయోజనాలు పొందక తీవ్రంగా నష్టపోయారు. దీంతో కాంగ్రెస్ సర్కార్ తీసుకొచ్చే భూ మాత కోసం రైతులు నిరీక్షిస్తున్నారు.

15 క్వింటాళ్ల పత్తి దగ్ధం

రాయికల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్నపెల్లి అనుబంధ గ్రామమైన మరాఠీ గూడెంలో పీపీ మాధవ్ అనే గిరిజన రైతుకు చెందిన పత్తి బుధవారం రాత్రి దగ్ధమైంది. లోయగూడెంలో కౌలుకు చేసుకున్న పత్తి పంట తీసి తన పూరి గుడిసెల కుప్పగా పోశాడు. గుడిసెలో ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో 15 క్వింటాళ్ల మేరకు పత్తి దగ్ధమైనట్లు తెలిపారు. కౌలుకు తీసుకుని ఆరుగాలం కష్టపడి చేతికందిన పంట కాలిపోవడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. దీంతో రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని వాపోయారు. దీనికి గల కారణాలు తెలియరాలేదు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి



ఆందోళన చేస్తున్న మూటపెల్లి గ్రామస్థులు

రాయికల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అర్హులకే సంక్షేమ పథకాలు అందించాలని మండలంలోని మూటపెల్లి గ్రామానికి చెందిన పలువురు గ్రామస్థులు గురువారం బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సభ్యుడు కంటె గంగారాం ఆధ్వర్యంలో రాయికల్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల, రేషన్ కార్డులు, రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారుల ఎంపికలో నిజమైన అర్హులు లేరని పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బర్కం మల్లేష్, ప్రధాన కార్యదర్శి రత్నాకర్ రావు, జిల్లా బీఆర్‌ఎస్ నాయకులు తురగ శ్రీధర్ రెడ్డి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కొల్లూరి వేణు, మండల మైనార్టీ అధ్యక్షుడు చాంద్ పాషా, నాయకులు కోల కుమార్, బట్టు నిశాంత్, అరుణ్, గంగారాం, శ్రీనివాస్, కునారపు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి సీఐకి సన్మానం

మెట్‌పల్లి టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్న మెట్‌పల్లి సిఐ నిరంజన్‌రెడ్డిని గురువారం బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, చింతల శ్రీకర్ గౌడ్, దొనికెల నవీన్, సుంకెట విజయ్, అనిల్ గౌడ్, నరేష్ పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

కొడిమ్యాల, జనవరి30 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణ నక్షత్రం సందర్భంగా గురువారం ఆలయ కమిటీ వారు గ్రామస్తులకు అన్నదానం నిర్వహించారు. అంతకు ముందు గోపూజ, స్వామి వారికి పల్లకీ సేవ, సహస్ర పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు ఆలయ పూజారి నాగరాజు రమేష్ నిర్వహించారు. ఉదయం నుండి స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, దాతలు పాల్గొన్నారు.

మార్కండేయ జయంతికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

జగిత్యాల అర్బన్, జనవరి (ఆంధ్రజ్యోతి) ఫిబ్రవరి 1వ తేదీన శ్రీ భక్త మార్కండేయ జయంతి సందర్భంగా నిర్వహించే ఉత్సవాలలో పాగ్గొనాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు గురువారం పద్మశాలి సంఘం నాయకులు ఆహ్వానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు బోగ చిన్న గంగాధర్, చెట్‌పెల్లి సుధాకర్, ప్రభాకర్, పవన్‌గౌడ్ ఉన్నారు.

జగిత్యాల మున్సిపల్ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మృతి

జగిత్యాల అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపాలిటీ మాజీ కో- అప్షన్ సభ్యులు కొత్తకొండ అంజయ్య జగిత్యాల ప్రభుత్వ ప్రదానాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించిన వషయం తెలిసి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం ఆసుపత్రికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆసుపత్రి వైద్యులను ఆయన ఆరోగ్య పరిస్థిపై ఆరా తీశారు. అంజయ్య మృతి పట్ల ఎమ్మెల్యేను డాక్టర్ సంజయ్ కుమార్, మాజీ మంత్రి రాజేశం గౌడ్‌లు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మైసమ్మ చెరువులోకి ఎల్లంపల్లి నీరు

● హర్షం వ్యక్తం చేస్తున్నరైతులు

కొడిమ్యాల, జనవరి30(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల-కొండాపూర్ గ్రామాల మధ్య ఉన్న మైసమ్మ చెరువులోకి బుధవారం రాత్రి నుంచి నారాయణపూర్ చెరువు నుండి ఎల్లంపల్లి నీరు చేరుతున్నాయి. గురువారం మల్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వినోద్‌రెడ్డి, నాగరాజు మైసమ్మ చెవులోకి వస్తున్న నీటిని చూసి హర్షం వ్యక్తం చేశారు. మైసమ్మ చెరువు ఎల్లంపల్లి నీటితో నింపటంతో రెండు రోజులలో నీటితో నిండగానే మండలంలోని పోతారం చెరువులోకి నీటిని తరలిస్తామని సంబంధిత ఈఈ సంతుప్రకాష్‌రావు తెలిపారు.

పల్లె దవాఖానాలు మంజూరు

కథలాపూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాండ్ర్యాల, భూషణరావుపేట గ్రామాలకు పల్లె దవాఖానాలు మంజూరయినట్లు పంచాయతీరాజ్ ఏఈ జగదీశ్వర్ తెలిపారు. వీటి నిర్మాణాల కోసం భూమిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని అన్నారు. ప్రభుత్వం రూపొందించిన నమూనా ప్రకారం పల్లె దవాఖానాలు నిర్మిస్తామని చెప్పారు.

స్వగ్రామం చేరిన గల్ఫ్ మృతదేహం

● బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

మల్యాల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రంకు చెందిన బోగ గంగసాయి(25) అనే యువకుడు ఈనెల 21న దుబాయిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోగా గురువారం రాత్రి మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్తులు, బంధువులు, మిత్రు లు విరాళాలు ప్రోగు చేసి అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు మృతుని కుటుంబసభ్యులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

కోరుట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శిశుమందిరంలో గణతంత్రి దినోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వివిధ ఆటల పోటీలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు గురువారం బహుమతులను మున్సిపల్ కమిషనర్ తిరుపతి బహుమతులు అందించారు. క్రమశిక్షణకు మారుపేరు సరస్వతి శిశుమందిర్ విద్యాసంస్థలని కమిషనర్ తిరుపతి అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపు వెంకటేష్, పాఠశాల డైరెకర్లు చంద్రమోహన్, కరస్పాడెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీడీ పరిశ్రమలపై జీఎస్టీని రద్దు చేయాలి

● ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు

కోరుట్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : బీడీ కార్మికుల ఉపాధి కాపాడి పరిశ్రమలపై విధించిన జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి బాలరాజు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పద్మశాలి భవనంలో రాష్ట్ర బీడి వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు, బీడి కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు సుతారి రాములతో కలిసి బాలరాజు ప్రారంభించారు. మహాసభలో కార్మికులతో కలిసి ఐక్యత నినాదం చేసి అమరులకు నివాళ్లను అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాట చేసిన సభలో బాలరాజు మాట్లాడారు. దేశ వ్యాప్యంగా ఉన్న బీడి కార్మికులకు ఒకే రకమైన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. బీడి కార్మికులకు కనీస పెన్షన్ కేవలం రూ. 1,000 లోపే ఉందని దానిని రూ. 5,000 కేంద్ర ప్రభుత్వం పెంచి బడ్జెట్‌లో ప్రత్యేకనిధి కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బీడి కార్మికులకు బడ్జెట్‌లో ప్రత్యేక నిదులు కేటాయించకుంటే దేశ రాజదాని అందోళన చెపట్టడానికి కార్మికులను సమాయుతం చేస్తున్నామని అన్నారు.



మాట్లాడుతున్న బాలరాజు

కార్మికులకు ప్రభుత్వాలు ఇండ్లు కట్టించి ఈఎస్‌ఐ ఆసు పత్రిని ప్రతి జిల్లా కేంద్రాలలో ఏర్పాటు చేయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ, సిపిఐ, బీడికార్మిక సంఘ నాయకులు విలాస్, సమ్మయ్య, ఎండి ముత్రం, గోవర్ధన్, కడారి రాములు, మౌలానా, చెన్న విశ్వనాథం, హనుమంత్, తోట బిక్షపతి, శాంత, ఉస్మాన్, రాదా, అనసూయ, గోదావరి, రంగారెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

● బీడీ కార్మికులకు పెన్షన్ కొరకు దరఖాస్తులు చేసుకోవడానికి పద్మశాలి సంఘ భవనానికి రావాలని కార్మిక సంఘ నాయకులు పట్టణంలోని వివిధ వార్డుల కు మహిళలను మహాసభకు తీసుకురావడం ఏమిటని ప్రశ్నిస్తూ బీజేపీ మాజీ కౌన్సిరల్ మ్యాడవేని నరేష్ కార్మిక సంఘ నాయకులతో వాగ్వాదానికి దిగాడు. పట్టణంలోని పద్మశాలి భవనంలో జరుగుతున్న మహా సభ కార్యక్రమం వద్ద వెళ్లిన వారితో నాయకులతో వాగ్వాదానికి దిగడం చర్చనీయాశంగా మారింది. దీంతో అక్కడ ఉన్నవారు నరేష్‌ను సముదాయించి పంపి వేయడంతో మహాసభ కార్యక్రమం సజావుగా సాగింది.

ఆలయ ఫౌండర్ చైర్మన్ మృతి

కొడిమ్యాల, జనవరి30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నాడి సత్యనారాయణరావు (88)బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. నల్లగొండ గ్రామ శివారులో ఎత్తైన గుట్టపై శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయం ఉండటంతో స్వామివారిని దర్శించుకోవటానికి భక్తులు ఇబ్బందులు ఎదుర్కోవటంతో భక్తుల సౌకర్యం కోసం 1991-1993లో గుట్ట కింద స్వామి వారి ఆలయాన్ని నిర్మించి స్వామివారిని ప్రతిష్టించారు.

ఉచిత వైద్యశిబిరం

మల్యాల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మల్యాలలో గురువారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కట్కం వినయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో గ్రామస్తులు వందలాదిగా పాల్గొని వైద్య పరీక్షలు చేసుకున్నారు. మల్యాల సీఐ నీలం రవి ఈ కార్యక్రమంలో పాల్గొని బీపీ పరీక్షలు చేసుకున్నారు. ఈ శిబిరంలో కరీంనగర్ ప్రతిమ ఫౌండేషన్, ఆసుపత్రికి చెందిన వైద్యబృందం సుమారు 200మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆర్గనైజర్ సల్మాన్, నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన సదస్సు

ధర్మపురి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని కస్తూరి బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ మేనేజర్ శ్రీనివాస్ ఆచార్య విద్యార్థులకు పలు అంశాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శిక్షణ మేనేజర్ శ్రీనివాస్ ఆచార్య విద్యార్థులకు దేశభక్తి, మానవత విలువలు, సమాజం, కుటుంబ బాధ్యతలు, పరీక్షలపై భయాన్ని తొలగించడం లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో యువతి, యువకుల సంఖ్య 706 శాతం ఉందని తెలిపారు. పిల్లలలో దాగి ఉన్న సృజనాత్మకత శక్తిని వెలికి తీసి వారిని గొప్ప మేధావులుగా అబ్దుల్ కలాం ఆశయాలకు అనుగుణంగా మార్చడం లీడ్ ఇండియా ఫౌండేషన్ ఉద్దేశ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ గురుకుల విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ వి. అరుణ, ట్రైనర్స్ జక్కుల తిరుపతిరావు, హిమజ పాల్గొన్నారు.

అగ్గి తెగులు నివారణకు చర్యలు చేపట్టాలి

● ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేతలు

కోరుట్ల రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వరికి అగ్గి తెగులు నివారణకు రైతులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం జగిత్యాల శాస్త్రవేత్తల బృందం రైతులకు సూచించింది. మండలంలోని ఎఖీన్‌పూర్, సంగెం గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలను రైతులు, మండల వ్యవసాయ అధికారిణి నాగమణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు అగ్గి తెగులు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. వరిలో మొగి పురుగు నివారణకు కార్టప్ హైడ్రో క్లోరైట్ ఎకరానికి 400 గ్రాములు, అగ్గి తెగుల నివారణకు ఇసోప్రోథియిలిన్ 300 మిల్లీ లీటరు 180 నుండి 200 లీటర్ల నీటిలో కలిసి పిచికారి చేయాలని సూచించారు. సిఫారస్ చేసిన నత్రజని ఎరువులను సమపాళ్ళలో మూడు దఫాలుగా వేసుకోవాలన్నారు. వరిలో జింక్‌లోపానికి 2 గ్రాముల జింక్ సల్ఫెట్ లీటర్ నిటీలో కలిసి పిచకారి చేయాలని సూచించారు. అదే విధంగా సల్ఫైడ్ దుష్పబావన్ని తగ్గించడానికి మొక్క వెర్లకు గాలి తగిలే మురుగు నీటినితీసి తిరిగి నీరు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం జగిత్యాల జిల్లా శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ బాలరాం, డాక్టర్ వరి, ఎఈఓ నరేష్, రైతులు పాల్గొన్నారు.



వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఎంపీడీవోగా నీరజ బాధ్యతల స్వీకరణ

భీమారం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల నూతన ఎంపీడీవోగా నీరజ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో 18 మండలాలు ఉండగా, సెప్టెంబరు 26, 2022న భీమారంను మండలంగా ప్రకటిస్తూ రాజముద్ర విడుదల చేశారు. అప్పటి నుంచి కొన్ని శాఖల కార్యాలయాలతో కాలం వెళ్లదీస్తున్నాయి. మొట్టమొదటి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన నీరజను ఉద్యోగులు అభినందించారు.

సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు భూమి గుర్తింపు

కథలాపూర్, జనవరి (ఆంధ్రజ్యోతి) : మహిళాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న సోలార్ పవర్‌ప్లాంట్ల ఏర్పాటుకుగాను ఐదు గ్రామాల్లో భూమి గుర్తించినట్లు సెర్ప్ ఏపీఎం నరహరి తెలిపారు. తాండ్ర్యాల, కలికోట, బొమ్మెన, చింతకుంట, కథలాపూర్ గ్రామాల్లో పవర్ ప్లాంట్లకోసం అవసరమయ్యే నాలుగు ఎకరాల భూమి రెవెన్యూ అధికారులు సర్వేచేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేసినట్లు చెప్పారు. ఒక్కో ప్లాంట్ రు. కోటి అంచనాతో ఏర్పాటుకు నిర్ణయించగా మహిళా సంఘాలు రు. 30లక్షల కాంట్రిబ్యూషన్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. 25 సంవత్సరాల పాటు ఎంఓయు కుదుర్చుకోనున్నారని తెలిపారు. సాంకేతిక బృందం ఎంపిక చేసిన భూములను పరిశీలించనుందని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కథలాపూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొమ్మెనలో ఎంపీ, కేంద్ర హోంశాఖా సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ నిధులు రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను గురు వారం బీజేపీ నాయకులు ప్రారంభించారు. ఎస్సీ కాలనీలో ఈ పనులను పూర్తి చేస్తామని నాయకులు పిడుగు అనందరెడ్డి, అల్లూరి బాపురెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉరుమల్ల సురేశ్, గాండ్లోజి స్వామి, కిషన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

మల్యాల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మల్యాలకు చెందిన కాంగ్రెస్ నాయకుడు కొక్కుల నాగభూషణం తల్లి లక్ష్మిని గురువారం ఎమ్మెల్సీ టీ.జీవన్‌రెడ్డి పరామర్శించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో కాంగ్రెస్ నాయకులతో కలిసి పరామర్శించి ఆమే ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు.